క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



బిర్లాగడ్డ వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్) : నగరంలో రహదారుల విస్తరణలో భాగంగా శుక్రవారం నగరపాలక టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్రమణలను తొలగించారు. స్థానిక బిర్లాగేట్ సమీపంలోని ప్రజారోగ్యసాంకేతిక శాఖ కార్యాలయం నుంచి ఆక్రమణలను తొలగించారు. సంక్షేమ భవన్ వద్ద ఉన్న తాత్కాలిక షాపులకు ఇప్పటికే విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. త్వరలో వాటిని తొలగించనున్నారు. అలాగే పూలే విగ్రహం నుంచి రాయల్ ఓక్ ఫర్నీచర్, రిలయన్స్ షాపు, వాల్ మార్ట్ వరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు మార్కింగ్ పనులు చేపట్టి ఫుట్‌పాత్ సహా నిర్మాణాలను తొలగించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించండి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయంతో కలిగే ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు, జిల్లా చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు మండలం రుద్రవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రసాయన ఎరువులతో వ్యవసాయం చేయడం వల్ల రైతులకు పెట్టుబడి వ్యయం పెరుగుతుందన్నారు. పురుగుమందులు,రసాయన ఎరువులు విచ్చలవిడిగా వాడటం ద్వారా ధాన్యం విషతుల్యమవుతుందన్నారు. అదే ప్రకృతి వ్యవసాయంలో కెమికల్స్ వినియోగం ఉండదని, ఘన, ద్రవ జీవామృతం, కషాయాల ద్వారానే పంటలు పండించవచ్చని వివరించారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంట దిగుబడులను పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం కన్సల్టెంటు లక్ష్మయ్య, సర్పంచ్ మధు పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు సిటీ: ఏపీ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ)77వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం స్థానిక సలాంఖాన్ భవనంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న ముఖ్య అతిథిగా పాల్గొని యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తిమ్మన్న మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూ అనేక పోరాటాలు చేసి హక్కులను కాపాడిందన్నారు. పండిట్, వ్యాయాయ ఉపాధ్యాయుల ఉన్నతీకరణలో తమ సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు.త ర్వాత రైల్వే స్టేషన్ ప్రాంతంలోని పట్టణ నిరాశ్రయులకు నిత్యావసర వస్తువులు సరఫరా చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గోకారి, కార్యదర్శి జనార్దన్, జిల్లా గౌరవ అధ్యక్షుడు సి.రమేష్, సీనియర్ నాయకులు షఫీ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే గుర్తింపు

కర్నూలు(రూరల్): 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కష్టపడి పనిచేస్తే గుర్తింపు లభిస్తుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ బాబు తెలిపారు. శుక్రవారం కళావెంకట్రావ్ భవనంలో సుధాకర్ బాబు జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుడైన నన్ను మున్సిపల్ చైర్మన్, శాసనమండలి సభ్యునిగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని గుర్తు చేశారు. పార్టీ కోసం కష్టపడి పని చేస్తే గుర్తింపు, పదవులు వాటంతట అవే వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ గుప్త, నగర అధ్యక్షుడు జాన్ విల్సన్, ఆదోని ఇన్‌చార్జ్ దేవిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పది మంది వైద్యుల బదిలీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు బోధనాసుపత్రినుంచి ఇతర బోధనాసుపత్రులకు మరో 10 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు (వైద్యులు) బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా శుక్రవారం కూడా వైద్యులకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇందులో డాక్టర్ ఎం.రేవతి(జనరల్ మెడిసిన్) తిరుపతిలోని స్విమ్స్‌కు, డాక్టర్ కె. శాంతి (ఈఎస్‌టీ), డాక్టర్ ఉమాదేవి (మైక్రోబయాలజీ), డాక్టర్ అనితారాణి(పాథాలజీ) అనంతపురానికి, డాక్టర్ పి. శిరీష(అప్తలాలజీ), డాక్టర్ ఎం.మహేష్(ఫోరెన్సిక్ మెడిసిన్) విజయవాడకు, డాక్టర్ ఎస్. ఇక్రముల్లా(సైకియాట్రి) కడపకు, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి(ఫోరెన్సిక్ మెడిసిన్), డాక్టర్ షేక్ హప్పా(రేడియాలజీ) నెల్లూరుకు, డాక్టర్ ఎం. శ్రీరాములు(ఫిజియాలజీ) గుంటూరుకు బదిలీ అయ్యారు.

కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు సిటీ: విద్యార్థులకు ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా బోధన చేస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు శుక్రవారం ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు మాట్లాడారు. ఎంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి పరేషాన్!

- ఈనెల 12న పునఃప్రారంభం కానున్న స్కూళ్లు
- ప్రైవేట్‌లో భారీగా పెరగనున్న చదువుల ఖర్చు
- ఈ ఒక్క నెలలోనే పేరెంట్స్‌పై వంద కోట్లకు పైగా అదనపు భారం
- గతేడాది కంటే 20–30 శాతం పెరిగిన ఫీజులు
- 20 శాతం పెరిగిన పుస్తకాల ధరలు
- బెంబేలెత్తుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు

చదువుకునే పిల్లలున్న తల్లిదండ్రుల గుండె గుబేల్‌మంటోంది. నూతన విద్యాసం వత్సరం ప్రారంభమవుతుండటంతో పిల్లల అడ్మిషన్లు, ఫీజులు, పుస్తకాలు,యూనిఫాం తదితర వాటికి భారీగా ఖర్చుపెట్టాల్సి ఉంటుంది. ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివించే పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. దీనికితోడు వ్యవసాయ సీజన్ కూడా ప్రారంభంకావడంతో ఆయా వర్గాలు పెట్టు'బడి'కి ఇబ్బందులు తప్పవంటున్నాయి.



కర్నూలు(సిటీ): దాదాపు జూన్‌నెలలోనే విద్యా సంస్థలు, వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయి. అటు స్కూల్ ఫీజులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం ఇటు పంటల సాగుకు విత్తనాలు, ఎరువులు, పెట్టుబడికి అప్పుల కోసం సామాన్య ప్రజలు అల్లాడుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు 20 నుంచి 30 శాతం వరకు పెంచేశారు. అదే విధంగా పాఠ్యపుస్తకాల ధరలను సైతం 15 నుంచి 20 శాతం పెరిగాయి. విద్యా సంస్థల బస్సుల ఫీజులు సైతం గతేడాది కంటే ఈ ఏడాది రూ.500 నుంచి 700 వరకు పెంచారు. ప్రస్తుత పరిస్థితుల్లో చదువు 'కొనాల్సి' వస్తోంది. నర్సరీ కోసం ఒక్కో విద్యార్థికి కనీసం రూ.25 వేల నుంచి రూ.45 వేల వరకు ఖర్చవుతోంది. ఆపై తరగతులకు మరింత ఖర్చు అవుతుంది. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చది వించే పేద, మధ్యతరగతి ప్రజలకు పిల్లల ప్రాథమిక విద్య భారమవుతోంది. పాఠశాలల్లో ఫీజులు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫాం తదితర ఖర్చుల కోసం ఒక్కో ఇంటికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అవసరమవుతుంది. దీంతో చాలా మంది జూన్‌నెలను తలుచుకుని హడలిపోతున్నారు.

ఫీజులుం...!

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు 739 ఉన్నాయి. ఈ స్కూళ్లలో 1.40 లక్షల మంది విద్యార్థులు (ఫస్ట్ క్లాస్ మినహా)ఉంటారు. సర్కారు బడుల్లో చక్కని చదువు దొరుకుతున్నా కొందరు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల వారి మాయ మాటలు నమ్మి పిల్లలను చేర్పిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులను పెం చేస్తున్నాయి. గతేడాది 1వ తరగతి విద్యార్థికి ఫీజు సరాసరి రూ.27 వేలు ఉండగా ఈ ఏడాది రూ.32 వేలు వసూలు చేయాలని కార్పొరేట్, సెమీ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు నిర్ణయించాయి. సరాసరిగా తరగతి వారీగా రూ.2500 నుంచి 4 వేల వరకు ఫీజులు పెంచారు. కార్పొరేట్ సంస్థలను చూసి సెమీ కార్పొరేట్, కొన్ని ప్రైవేటు పాఠశాలలు సైతం ఫీజులను పెంచేస్తున్నాయి. ముందస్తుగా ఫీజు కట్టాలని.. అడ్మిషన్లు రాయించుకోవాలని ఒత్తిడి చేస్తున్నాయి. ఆలస్యం చేస్తే అడ్మిషన్లు ఉండవని చెబుతున్నాయి. దీంతో ఆందోళనకు గురవుతున్న తల్లిదండ్రులు ఫీజు కట్టి అడ్మిషన్ రాయించుకుంటున్నారు. ఈ ఏడాది పెరిగిన ఫీజులతో తల్లిదండ్రులపై సుమారుగా రూ. 63 కోట్లు అదనపు భారం పడుతుంది.

20 శాతం పెరుగుదల...

గత ఏడాది రూ.60 ఉన్న నోటు పుస్తకం ధర ఈ ఏడాది రూ.75 పైమాటే. గత ఏడాది ఆరో తరగతి విద్యార్థుల కు సరాసరిగా రూ.4500 వరకు నోటు పుస్తకాలు, పా ఠ్య పుస్తకాలకు ఖర్చయ్యేది. ఇప్పుడు పెరిగిన ధరతో రూ.6500 పైమాటే. ఇది ఒక్క నోటు పుస్తకాలకే. ఇంకా పెన్నులు, పెన్సిళ్లు, స్కూల్ బ్యాగ్, బూట్లు, యూని ఫాం, టై అదనం. గతేడాది కంటే ఈసారి ఒక్కో విద్యా ర్థిపై సరాసరిగా రూ.2 వేల వరకు అదనపు ఖర్చు పెరుగుతుంది. ఈ లెక్కన జిల్లాలో సుమారుగా తల్లిదండ్రులపై రూ.28 కోట్ల వరకు భారంపడుతుంది. దీంతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని ప్రైవేటు విద్యాసంస్థలు స్కూల్ బస్, ఆటో చార్జీలను పెంచుతున్నాయి.

ఫీజుల భారం పెరుగుతుంది



నేను ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాను. నాకు ఒకు కుమార్తె. ఇంటర్మీడియేట్ చదువుతుంది. కాలేజీ ఫీజులు ఏటేటా పెంచుతున్నారు. జూన్ నెల వచ్చిందంటే చాలు చదువుల కోసం అప్పులు చేయాల్సి వస్తుంది. కోర్సు ఫీజులతో పాటు, పుస్తకాలు ఫీజులు ఒకే సారి చెల్లించాలి. పిల్లల భవిష్యత్తు కోసం తప్పని పరిస్థితిలో చదివించుకోవాల్సి వస్తుంది. – కురువ చిరంజీవి, కల్లూరు

అప్పులు చేయాల్సిందే



మాకు ఇద్దరు పిల్లలు.ఒకరు ఒకటో తరగతి, మరొకరు మూడో తరగతి. ఓ ప్రైవేటు స్కూల్‌లో చేర్పించేందుకు వెళ్లగా ప్రాథమిక విద్యకు పుస్తకాలు, యూనిఫాం కాకుండా రూ.46 వేలు చెబుతున్నారు. పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సి వస్తుంది.ఆటో మెకానిక్‌గా వచ్చే సంపాదన కుటుంబ పోషణకే సరిపోతుంది. – వలి, ఆటో మెకానిక్, బళ్లారి చౌరస్తా

విద్యుత్ అంతరాయంపై వెంటనే స్పందించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ సరఫరాలో ఏర్పడే అంతరాయం వెంటనే స్పందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. శుక్రవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం, గాలి, ఇతర సాంకేతిక సమస్యలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతూ ఉంటుందని, ముఖ్యంగా బ్రేక్ డౌన్, ఫీడర్ డౌన్, ట్రిప్పింగ్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ఎగ్జిఫ్యూజ్, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ కాలిపోవడం వంటి కారణాలతో అంతరాయం ఏర్పడుతుంటుందన్నారు. దీని వల్ల కరెంటు పోయిందని వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు.

రెగ్యులర్ చేయాలని వినతి

కర్నూలు(రాజ్‌విహార్): కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల కాంట్రాక్టు ఉద్యోగులు విన్నవించారు. శుక్రవారం వారు కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డిని కలిసి సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

ఊపందుకున్న విస్తరణ పనులు

కర్నూలు (టౌన్) : నగరంలో రహదారుల విస్తరణ పనులు ఊపందుకున్నాయి. ట్రాఫిక్ రోజురోజుకు పెరిగిపోతుండటంతో నగరంలోని 116 స్పైర్ కిలోమీటర్ల పరిధిలో సర్వే పనులు ప్రారంభమయ్యాయి. మొత్తం 5 టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్‌లో 12 మంది సచివాలయ ఉద్యోగులు (ప్లానింగ్ కార్యదర్శులు)ను నియమించారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో కేటాయించిన సర్వే పనులు చేపట్టాల్సి ఉంటుంది. కిడ్స్ వరల్డ్ నుంచి 850 మీటర్ల పరిధిలో ఉన్న మౌర్య ఇన్ వరకు అలాగే మౌర్య ఇన్ నుంచి 750 మీటర్ల పరిధిలో ఉన్న ఈద్గా వరకు, అక్కడి నుంచి 1000 మీటర్ల పరిధిలో ఉన్న బళ్లారి చౌరస్తా వరకు, అలాగే గాయత్రీ ఎస్టేట్ నుంచి 1100 మీటర్ల పరిధిలో ఉన్న శకుంతల కల్యాణ మండపం వరకు యుద్ధ ప్రాతిపదికన సర్వే చేయనున్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

- టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కర్నూలు (సెంట్రల్) : ఇళ్ల నిర్మాణాలను బాధ్యతగా తీసుకుని త్వరగా పూర్తి చేయాలని జిలా కలెక్టర్ సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీఓలు, హౌసింగ్ ఇంజినీర్లతో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధి హామీ పనుల అమలుపై కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్టేజ్ కన్వర్షన్ పనుల్లో నిర్దేశించిన లక్ష్యానిన సాధించకపోతే తగిన చర్యలు తప్పవని పలు మండలాల అధికారులను హెచ్చరించారు. హౌసింగ్ నిర్మాణాల్లో పురోగతి కనబరచని గోనెగండ్ల ఎంపీడీఓకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లాపరిషత్ సీఈఓని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాని లబ్ధిదారుల వివరాలను వారి పేర్లతో సహా తగిన నివేదిక రూపంలో తహసీల్దార్, ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈ సంతకం చేసి ఇవ్వాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లాపరిషత్ సీఈఓ, హౌసింగ్ పీడీ, డ్వామా పీడీ, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్ సుందరీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కర్నూలు(రూరల్): స్విమ్మింగ్ పూల్ సుందరీకరణకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన క్రీడా శాఖాధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కిసాన్ ఘాట్ రోడ్డులో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఈత కొలనును ఆమె పరిశీలించారు. క్రీడాకారులకు కల్పిస్తున్న వసతుల క్రీడా శాఖ సీఈఓ పి.వి.రమణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఔట్‌డోర్ స్టేడియాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వాకింగ్ కోసం వచ్చే వారికి ప్రత్యేక సమయం కేటాయించాలని శిక్షకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆర్చరీ కోసం 50 మీటర్లు ఉన్న పార్కును కేటాయించాలని కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వాలీబాల్ కోర్టుకు ఎర్రమట్టి తరలించుటకు అనుమతి ఇవ్వాలని కోరారు. కలెక్టర్ వెంట సీఈఓ రమణ, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి



సేవా పురస్కారాలు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మున్సిపల్ అధికారులు

- ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేతలో వారిది కీలక పాత్ర
- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్/రాజ్‌విహార్) : ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచి వలంటీర్లు అందిస్తున్న సేవలు ఎనలేనివని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక సుంకేసుల రోడ్డులోని ఎస్‌బీఐ కాలనీలో ఉన్న నూతన కౌన్సిల్ సమావేశ హాలులో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెలకొల్పిన వలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శమన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చడంలో వలంటీర్లది కీలక పాత్ర అన్నారు. అంతేకాదు సచివాలయ పరిధిలో ఎవరికి ఏ అవసరం వచ్చినా మేమున్నామంటూ సేవలందిస్తున్నారన్నారు. అనంతరం కర్నూలు నియోజకవర్గంలోని 7 వ వార్డు నుంచి 12 వ వార్డుల పరిధిలో ఉన్న 18 నుంచి 29 వరకు ఉన్న సచివాలయాల వలంటీర్లకు సేవా మిత్ర, సేవారత్న, సేవా వజ్ర సేవ మిత్ర అవార్డులతో ఘనంగా సత్కరించారు. ఇందులో ఐదుగురికి సేవా వజ్ర అవార్డులు లభించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, మెప్మా టౌన్ ప్రాజెక్టు అధికారి వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు జుబేర్ అహమ్మద్, పుల్లమ్మ, యూసుఫ్‌బాషా, ఫరాజ్‌ఖాన్, షాషావలీ, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పథకాలు

ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక 3వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మొగల్‌పురా, సాగ్ మండి, ఖురేషి వీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి యజమానులకు సంక్షేమ క్యాలెండర్ అందజేశారు. కార్పొరేటర్ షాజహాన్ పర్వీన్, పార్టీ నాయకులు ఖాదర్ బాషా, ఖుద్దూస్, చాంద్ బాషా, అంజు, ముజహీద్, మున్న, గౌసియా, అక్బర్ పాల్గొన్నారు.

సమస్యలపై నేరుగా కలవండి

ఏవైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తనను కలిసి విన్నవిస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన తన నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ నిర్వమించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి, ఆ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు.



విజయ యాత్రలో భాగంగా కర్నూలుకు చేరుకున్న ఆది శంకరాచార్య పరంపర కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామిని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వచనం పొందారు.

-కర్నూలు కల్చరల్

భూ రీసర్వేపై పూర్తి అవగాహన అవసరం

- కర్నూలు డివిజన్ సర్వేయర్లు, వీఆర్వోల శిక్షణ తరగతుల్లో జేసీ ఎన్.మౌర్య



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఎస్.మౌర్య

కర్నూలు(సెంట్రల్) : భూముల రీసర్వేపై సర్వేయర్లు, వీర్వోలు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకంపై పూర్తి స్థాయి అవగాహన కోసం కర్నూలు డివిజన్‌లోని సర్వేయర్లు, వీఆర్వోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అనాదిగా పేరుకుపోయిన భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 100 సంవత్సరాల తరువాత గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయ, గ్రామకంఠం, స్థిరాస్తులకు సంబంధించి రీసర్వేకు ఆదేశించిందన్నారు. ఈ రీసర్వేపై సర్వేయర్లు, వీఆర్వోలకు పూర్తి స్థాయి అవగాహన కోసం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కచ్చితమైన కొలతలతో సర్వే చేయడం కోసం మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ బృందం అధునాతన పరికరాలైన డ్రోన్‌లు,హెలికాప్టర్లను వినియోగించి సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. సర్వేలో మొదట గ్రామ సరిహద్దులను నిర్దేశించుకోవాలన్నారు. ఆ తరువాత గ్రౌండ్ ట్రూతింగ్‌కు వెళ్లాలన్నారు. కర్నూలు డివిజన్‌లో నిర్దేశించిన లక్ష్యం మేరకు రీసర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ హరిప్రసాదు, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ రామ్మోహన్, డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్నలక్ష్మి, డీఐ విజయ సారథి పాల్గొన్నారు.

మెనూ సవరణపై పునరాలోచించాలి

- కలెక్టర్‌కు వినతి పత్రం అందించిన హెచ్‌డబ్ల్యూఓలు



సమావేశంలో మాట్లాడుతున్న పి. శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఆహార వస్తువుల ధరలను పరిగణనలోకి తీసుకోకుండా మెనూ సవరించడం ద్వారా పడుతున్న అదనపు ఆర్థిక భారంపై పునరాలోచించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలకు చెందిన వసతి గృహ సంక్షేమాధికారులు కోరారు. శుక్రవారం స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ బాలుర వసతి గృహంలో బీసీ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పి. సత్యనారాయణరాజు అధ్యక్షతన ఆయా సంక్షేమ శాఖలకు చెందిన హెచ్‌డబ్ల్యూఓల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ ప్రకారం కర్నూలు జిల్లా డీపీసీ రేట్లతో చూస్తే ప్రీ మెట్రిక్ విద్యార్థులకు రోజుకు రూ.10.56 పైసలు, పోస్టు మెట్రిక్ విద్యార్థులకు రూ.17.36 పైసలు అదనపు భారం పడుతుందన్నారు. ఈ భారాన్ని వంద మంది విద్యార్థులకు నెలకు లెక్కిస్తే ఒక్కో హెచ్‌డబ్ల్యూఓపై దాదాపు రూ.50 వేలు పడుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం పునరాలోచించి వసతి గృహ సంక్షేమాధికారులపై అదనపు భారం పడకుండా చూడాలని కోరారు. ఈ మేరకు వారు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కోశాధికారి అబ్దుల్ అజీమ్, అసోసియేట్ అధ్యక్షుడు పి. మాదప్ప, కె. హారతీదేవి, ఎస్ ప్రమీలమ్మ, ఎస్ డబ్ల్యూ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం అధ్యక్షుడు పి. సుంకన్న, ప్రధాన కార్యదర్శి బెన్నమ్మ, అసోసియేట్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు ఎం. శ్రీనివాసులు, శివుడు, శంకర్, గిరిజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇండక్షన్ ట్రైనింగ్

కర్నూలు సిటీ: డీఎస్సీ–2018 ఉర్దూ మీడియం టీచర్లకు ఈ నెల 5వ తేదీ నుంచి డైట్ కాలేజీలో ఏర్పాటు చేసిన ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి డీఈఓ డా.వి రంగారెడ్డి హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

కర్నూలులో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలో శనివారం చేపట్టే మరమ్మతు పనుల కోసం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రెండు సబ్ డివిజన్ల పరిధిలోని 33 కేవీ సబ్‌స్టేషన్లు, 33/11కేవీ సబ్‌స్టేషన్లు, 33, 11కేవీ ఫీడర్లలో ఈ పనులు జరగనున్నాయని పేర్కొన్నారు. కల్లూరు, ఓర్వకల్లు, కర్నూలు మండలాల్లోని గ్రామాల్లో పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. సబ్ డివిజన్–1లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు.. సబ్ డివిజన్–2లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి నెల రెండవ శనివారం చేపట్టే నిర్వహణ పనుల కోసం కోతలు విధిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్పోర్ట్స్

క్రీడల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (రూరల్) : విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటాలని ఈఎస్‌టీ ఫౌండర్ దాసరి సుదీర్ అన్నారు. ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్, త్రోబాల్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం గణేష్ నగర్‌లోని మున్సిపల్ పార్కులో నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు.

ఈనెల 10,11న జాతీయ స్థాయి రగ్బీ పోటీలు

కర్నూలు(రూరల్) : మహారాష్ట్రలోని పూణేలో ఈనెల 10, 11 తేదీల్లో జాతీయస్థాయి సీనియర్ మహిళల రగ్బీ పోటీలు జరుగుతున్నాయని, ఇందులో జిల్లా క్రీడాకారులు రాణించాలని ఏపీ రగ్బీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు కోరారు. శుక్రవారం నగరంలోని బి.క్యాంప్ క్రీడా మైదానంలో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్న జట్టును ప్రకటించారు. ఇందులో క్రీడాకారులు కీర్తి, లిల్లి, కుసుమ, లక్ష్మీప్రసన్న, కవిత, కావ్య, జ్యోతి, సరస్వతి, ధరణి, పూర్ణిమ, హారిక, శశికళ ఉన్నారు. టీమ్ మేనేజర్‌గా సునీత, కోచ్‌గా వంశీకుమార్ వ్యవహరిస్తున్నారు.

అవీ-ఇవీ

మేయర్ బీవై రామయ్యకు అభినందన

కర్నూలు (టౌన్): ఆల్ ఇండియా మేయర్స్ ఆఫ్ కౌన్సిల్ కార్యనిర్వాహక సభ్యుడిగా నియమితులైె నగర మేయర్ బీవై రామయ్యను పలువురు కార్పొరేటర్లు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు అభినందించారు. శుక్రవారం మేయర్‌ను స్థానిక ఆయన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణ, కార్పొరేటర్లు రాజేశ్వరరెడ్డి, క్రిష్ణకాంత్ రెడ్డి వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు రమణ, నారాయణ, విద్యార్థి విభాగం నాయకులు రెడ్డి పోగు ప్రశాంత్ తదితరులు కలిశారు.

డయాగ్నోస్టిక్ సెంటర్‌లో వసతులు కల్పించాలి

కర్నూలు(హాస్పిటల్): పెద్దాసుపత్రిలో నూతనంగా నిర్మించిన డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో అవసరమైన వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు,నగర కార్యదర్శి బీసన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ బ్లాక్‌ను పరిశీలించి మాట్లాడారు.

11న బధిరుల క్రీడా సమాఖ్య ఎన్నికలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా బధిరుల క్రీడా సమాఖ్య ఎన్నికలు 2023–27 సంవత్సరాలకు ఈ నెల 11న జరుగనున్నాయి. కలెక్టరేట్‌లోని పొదుపు భవన్‌లో నిర్వహించే ఈ ఎన్నికల్లో ఆసక్తి కలిగిన చెవిటి, మూగ ఉద్యోగులు పోటీకి నామినేషన్లు వేయవచ్చని జిల్లా బధిరుల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి సాధిక్‌బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

32వ వార్డులో కమిషనర్ పర్యటన

కల్లూరు : కల్లూరు అర్బన్ 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో కమిషనర్ భార్గవ తేజ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ముజఫర్ నగర్‌లోని రైతు బజార్‌ని పరిశీలించారు. కార్పొరేటర్ సాన శ్రీనివాసులు రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కమిషనర్‌ను కోరారు.

తక్కువ వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకోండి



మెగా ఔట్ రీచ్ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు

కర్నూలు(అర్బన్) : యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఖాతాదారులకు తక్కువ వడ్డీ రేటుతో ఇచ్చే అన్ని రకాల రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరస్వామి కోరారు. శుక్రవారం ఆ బ్యాంక్ మెగా ఔట్ రీచ్ కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు రీజనల్ హెడ్ నరసింహరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ హెడ్ సురేంద్ర గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

కర్నూలు(రాజ్‌విహార్): పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.